క్లుప్తంగా

కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు


ప్రత్యేకాలంకరణలో కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం భారీగా అభిషేకాలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, రవి, సత్తిబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సప్తాహం


సంకీర్తనలు ఆలపిస్తున్న భజన మండలి బృందం

పెదపూడి: పుట్టకొండ గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో సీతారామచంద్రస్వామి ప్రథమ సప్తాహం భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. నాలుగో రోజైన మంగళవారం ప్రముఖ పండితులు పి.కమలాకర్, చంద్రమౌళి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వల్లు వెంకటరమణ మాట్లాడుతూ, గ్రామస్తులు, భక్తుల సహకారంతో సప్తాహం కనులపండువగా జరుగుతున్నాయన్నారు. సంపర గ్రామానికి చెందిన రంగస్థల నటుడు, డ్రామా ఆర్టిస్ట్ నిమ్మకాయల సాయిరామ భజన బృందం, ప్రముఖ హరిదాసు భజన బృందం పాలిలు స్వామివారి సంకీర్తనలు ఆలపించారు. అనంతరం భజన బృందాలను సప్తాహ కమిటీ ప్రతినిధులు శాలువా, పూలమాలలతో సత్కరించారు.

వృద్ధులు, దివ్యాంగులు రావద్దు


బిక్కవోలులో వృద్ధురాలికి ఇంటి వద్ద రేషన్ అందించడాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బిక్కవోలు: మండలంలోని 65 ఏళ్లు దాటిన వృద్ధులతో పాటు, దివ్యాంగులు, మంచంపై ఉన్న రోగులు సరకుల కోసం రేషన్ షాపు వద్దకు రావద్దని తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ అన్నారు. మంగళవారం గ్రామంలోని పలు రేషన్ షాపులను ఆయన పరిశీలించారు. వృద్ధులకు ఇంటి వద్దకు రేషన్ అందించడాన్ని తనిఖీ చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపు వద్ద సరకులు ఇస్తారని వివరించారు. ఎక్కడైనా తూకంలో తేడా వస్తే తమకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అలాగే బలభద్రపురంలో రేషన్ షాపును తనిఖీ చేసి, తూకాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఏఎస్‌వో నాగాంజనేయులు, ఎంఎస్‌వో రంగాప్రసాద్ ఉన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

అనపర్తి: మండుతున్న ఎండలకు అల్లాడుతున్న బాటసారుల సేదతీర్చడానికి అనపర్తికి చెందిన రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీభగలాముఖి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈ కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన కర్రి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టినట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నల్లమిల్లి ఆదిరెడ్డి తెలిపారు.

మహిళపై కర్రతో దాడి

సీతానగరం: ఇంట్లో ఉన్న మహిళపై కర్రతో దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు, రాపాకకు చెందిన కోమలి సుబ్బలక్ష్మి భర్త శంకరం సోమవారం ఉదయం సైకిల్‌పై వెళుతూ భూరపు చంద్రశేఖర్ ఇంటి వద్ద పడిపోయాడు. దీనితో చంద్రశేఖర్, శంకరం మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి, ఘర్షణకు దారితీసింది. దీంతో తన భర్తపై గొడవ పడుతున్న చంద్రశేఖర్‌ను సుబ్బలక్ష్మి మందలించింది. ఆగ్రహించిన చంద్రశేఖర్ ఆమె ఇంటికి వెళ్లి కర్రతో దాడి చేశాడు. గాయపడిన సుబ్బలక్ష్మి రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చేరింది. ఆస్పత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామ్‌కుమార్ తెలిపారు.

వ్యర్థం.. భూమికి బలవర్ధకం

- సేంద్రియ ఎరువుల వైపు రైతుల మొగ్గు
- తక్కువ ఖర్చుతో అధిక లాభాలు
- క్లస్టర్‌లో 63 వేల ఎకరాల్లో వరి సాగు


పెదపూడిలో పశువుల పేడ, చెత్త, పెంటను పొలాలకు తరలిస్తున్న ట్రాక్టర్


కైకవోలులోని పొలంలో చల్లడానికి సిద్ధంగా పెంట కుప్పలు

పెదపూడి: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సేంద్రియ ఎరువుల వినియోగం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు వ్యవసాయ శాఖ అధికారులూ ప్రోత్సహిస్తున్నారు. రసాయన ఎరువుల వాడకంతో వచ్చే అనర్థాలను గుర్తించిన అనేక మంది రైతులు భూసారం పెంపుపై దృష్టి సారించారు. పశువుల పేడ, కోడిపెంట, చీకిన గడ్డితో పాటు, చెరువులు, కుంటల్లోని పూడిక మట్టిని పొలాల్లో వేస్తున్నారు. తరుచూ రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోయి పంటలకు చీడపీడలు సోకి, దిగబడులు గణనీయంగా తగ్గిపోయి రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలనిచ్చే సేంద్రియ ఎరువులనే వాడాలని రైతులు భావిస్తున్నారు. పశు సంపద లేని రైతులు, కోళ్ల ఫారాల్లోని కోళ్లపెంట, చెరువులు, కుంటల్లో పూడిక మట్టిని కొనుగోలు చేసి మరీ పొలాల్లో వేస్తున్నారు. దీంతో తక్కువ వ్యయంతో అధిక ప్రయోజనాలు రైతులకు దక్కుతున్నాయి.

క్లస్టర్‌లో ఇలా..

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేట, రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో 63 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. దీనిలో సుమారు 40 శాతం మంది రైతులు పొలాల్లో సేంద్రియ ఎరువులు వినియోగించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో రైతులు పొలాలకు మట్టి, పెంటను తరలిస్తున్నారు. పొలాల్లో పంట దమ్ములకు ముందే సేంద్రియ ఎరువులను పొలాల్లో వేసి కలియ దున్నితే త్వరగా మట్టిలో కలిసిపోయి, మంచి ఫలితాలను ఇస్తాయని పలువురు రైతులు చెబుతున్నారు. దీంతో ఇప్పటికే రైతులు పొలాలకు వీటిని తరలించడంలో నిమగ్నమయ్యారు.

అధిక ప్రయోజనాలు

- పంటకు కావలసిన అన్ని ముఖ్యమైన పోషకాలను సేంద్రియ ఎరువుల ద్వారా అందించవచ్చు.
- భూమిలో నీటిని నిల్వ చేయడానికి సేంద్రియ ఎరువులు సహకరిస్తాయి.
- భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండి, పంటలు ఎండిపోకుండా దోహదపడతాయి.
- నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నప్పుడు సేంద్రియ ఎరువులు భూమి పొరలలో ఉండే నీటిని మొక్కలకు లభ్యమయ్యేటట్లు చేస్తాయి.
- సేంద్రియ ఎరువులు భౌతిక లక్షణాలను ప్రభావితం చేస్తాయి. ఇసుక నేలల్లో మెత్తని మట్టి శాతాన్ని పెంచడానికి, నీటిని పట్టి ఉంచే శక్తి పెంపొందించడానికి బాగా దోహదపడతాయి.
- ఫలితంగా మొక్కలు ప్రతికూల పరిస్థితులు తట్టుకుని పెరగడానికి అవకాశం ఏర్పడుతుంది.
- వివిధ రకాల ఎరువుల వలన కలిగిన సమస్యలను సేంద్రియ ఎరువుల వాడకంతో పరిష్కరించుకోవచ్చు.
- నేలలో మొక్కలకు మేలు చేసే అనేక రకాల సూక్ష్మజీవులుంటాయి. ఈ సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందడానికి సేంద్రియ ఎరువులు ఆహారంగా ఉపయోగపడతాయి.
- సేంద్రియ ఎరువులు వాడిన పొలాల్లో, చీడ పీడలు, తెగుళ్లు తక్కువగా ఉంటాయి. ఈ పొలాల్లో నాణ్యమైన దిగుబడి వస్తుంది.

రైతుకు, పంటకు మేలు



పొలాల్లో సేంద్రియ ఎరువులు వాడటంతో రైతుకూ, పంటకూ మేలు జరుగుతుంది. రైతుకు తక్కువ ఖర్చుతో చాలా లాభాలు ఉంటాయి. నాణ్యమైన పంటలు పండుతాయి.

– టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయాధికారి, పెదపూడి

ప్రజలను వంచించిన ఘనుడు చంద్రబాబు


పెదపూడిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు

వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను

పెదపూడి: మోసపూరిత వాగ్దానాలతో రాష్ట్ర ప్రజలను వంచించిన ఘనుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను విమర్శించారు. పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన పెదపూడిలో బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేతా శ్రీను మాట్లాడుతూ, అధికారం కోసం కూటమి ప్రభుత్వం మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. ఆ మోసాన్ని ప్రజలకు వివరించి, వారిలో చైతన్యం తీసుకురావడానికి వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానని హామీలిచ్చి, అధికారం చేపట్టిన తరువాత చంద్రబాబు ప్రజలను వంచించారన్నారు. ప్రజలకు జరిగిన అన్యాయంపై వైఎస్సార్ సీపీ శ్రేణులంతా గళమెత్తాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టకుండా అరాచక పాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పేపకాయల వెంకటరమణ, సమ్మంగి దుర్గాప్రసాద్, వేండ్ర సర్పంచ్ కోసూరి వాసు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ సాంబత్తుల చంటి, జిల్లా కమిటీ సభ్యుడు డొకుబుర్ర కృష్ణ, నాయకులు గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, అందుగుల అబ్బు, దొండపాటి దావీదు, చేవ సత్యనారాయణ, పంపన రమణ, మార్ని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

కోరుకొండ: కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా, ప్రజలను వంచిస్తున్నందున బుధవారం వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అడపా కనకరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నివాసం నుంచి బైక్ ర్యాలీ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ర్యాలీ కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయం వరకూ కొనసాగుతుందన్నారు. అక్కడ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వెన్నుపోటు దినం నిరసనకు తరలిరండి

వైఎస్సార్ సీపీ అనపర్తి కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన ప్రభుత్వం.. ఆ బూటకపు హామీలను అటకెక్కించి పేద, మధ్య తరగతి ప్రజలకు వెన్నుపోటు పొడిచి ఏడాది పూర్తయిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిరసనలో భాగంగా బుధవారం అనపర్తి నియోజకవర్గ కేంద్రంలో చేపట్టే కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి, మెయిన్ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంటామన్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మృతుల కుటుంబాలకు జక్కంపూడి పరామర్శ


కవలగొయ్యిలో శివ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి


భౌతికకాయాలకు నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్

రాజానగరం: ఏడీబీ రోడ్డులో వడిశలేరు వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన రఘునాథపురానికి చెందిన రేలంగి శివన్నారాయణ కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఈ దుర్ఘటనలో శివన్నారాయణతో పాటు, అతని భార్య దేవీలలిత, కుమార్తె వర్షిత, రాజమహేంద్రవరం రూరల్ మండలం కవలగొయ్యికి చెందిన అతని బావమరిది తీగిరెడ్డి శివ, అతని కుమార్తె సాన్వి మృతి చెందిన సంగతి విదితమే. అలాగే మరో కుమార్తె హర్షిత, శివ భార్య భవాని గాయాలతో చికిత్స పొందుతున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి బంధువులకు మంగళవారం అప్పగించారు. దీంతో ఆయా కుటుంబ సభ్యులను కలుసుకుని, మృతులకు నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. అలాగే మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ కూడా బాధిత కుటుంబాలను పరామర్శించి, సానుభూతి తెలిపారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన


రంగంపేటలో పేపర్ క్రాఫ్ట్‌లతో విద్యార్థులు


డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రంగంపేట: విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఉపకరిస్తాయని రంగంపేట గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో కాలిక్యులేటర్, పుష్పగుచ్ఛం, పెన్‌స్టాండ్ వంటివి తయారు చేశారు. విద్యార్థులు ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని రామకోటేశ్వరరావు సూచించారు.

విద్యార్థులకు పోటీలు

రాజానగరం: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు జరిగాయి. స్వర్ణాంధ్ర–2047 అనే అంశం పోటీలను నిర్వహించారు. విజేతలకు శిక్షణ తరగతులు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ కె.సత్యనారాయణ తెలిపారు.

చదరంగం పోటీలు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు లైబ్రేరియన్ టి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. మంగళవారం పాఠశాల విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. అలాగే కథలు చెప్పడం, వినడం, పుస్తక పఠనం, సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయుడు జి.అశోక్‌కుమార్, విశ్రాంత సహాయ సంక్షేమాధికారి ఓఎస్ సురేష్‌బాబు తెలుగు, ఇంగ్లిష్, హిందీ స్పీకింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పోటీలో విజేతలకు బహుమతులు అందించారు.


సీతానగరంలో వేసవి శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు

సీటీఆర్‌ఐ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ప్రసాద్


కరకుదురులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్

పెదపూడి: రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని రాజమహేంద్రవరం కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎల్‌కే ప్రసాద్ అన్నారు. కరకుదురు గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ ఎల్‌కే ప్రసాద్, కలవచర్ల కృషి విజ్ఞాన్ కేంద్ర శాస్త్రవేత్తలు నాగేశ్వర్‌రెడ్డి, రవీంద్రహరీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ, డ్రోన్ సాయంతో రాబోయే రోజుల్లో పురుగు మందులు పిచికారీ చేసే విధంగా రైతులకు మరింత సాంకేతికత ముందుకు తీసుకొస్తామన్నారు. నానో యూరియా వంటి ఎరువులను డ్రోన్ సాయంతో ఎకరానికి 500 ఎంఎల్ పిచికారీ చేయవచ్చన్నారు. తద్వారా యూరియా మోతాదు ఎకరానికి తగ్గించవచ్చని, చీడపీడల ఉధృతిని నివారించవచ్చన్నారు. వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తూ తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధించే విధంగా పథకాలు రూపొందించామన్నారు. పెద్దాపురం రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు మాధవి మాట్లాడుతూ, రైతులు తప్పనిసరిగా ఎకరానికి పాతిక కేజీల పటాస్ వాడాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ మాట్లాడుతూ, జూన్ ఒకటిన ఖరీఫ్ సీజన్‌కు నీటిని విడుదల చేశారన్నారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకుని, విత్తనాలు, నారుమడులు, దమ్ములు తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాగునీటి డీసీ చైర్మన్ సానా శ్రీనివాసు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిర్రా వరప్రసాద్, మాజీ సర్పంచ్ దత్తుడు, తోటకూర వెంకటేశ్వరరావు, ఆరుమిల్లి వాసు, అబ్బాయి చౌదరి, ఉద్యాన వన శాఖ అధికారి సుజాత, ఏఈఓ జయశంకర్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ దివ్య, రైతులు పాల్గొన్నారు.

అలసత్వాన్ని సహించేది లేదు

ఉచిత సీట్లపై డీఐ దిలీప్‌కుమార్



కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేందుకు నిర్దేశించిన 25 శాతం ఉచిత సీట్ల విషయంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అర్బన్ పరిధిలోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యా హక్కు చట్టం 12(1)సి ప్రకారం ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలు, బలహీనవర్గాల పిల్లలకు సమీప ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వ సిలబస్ అనుసరిస్తున్న అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు ఉచితంగా ప్రభుత్వం కేటాయించిందన్నారు. అర్హులైన వారికి విధిగా అడ్మిషన్ ఇవ్వాల్సిందేనన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాల ఆవరణలో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం విక్రయించరాదని ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఫీజు వసూలు చేయాలని, ఫీజు వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. పాఠశాలలో విధిగా కంప్లైంట్ బాక్స్ ఉండాలన్నారు. బస్సులను నిర్వహించే వారు వాహన ఫిట్‌నెస్ సరిచూసుకోవాలని డ్రైవర్లకు సూచించాలన్నారు. విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కోరుకొండ: వార్షిక మరమ్మతులు, ట్రీ కటింగ్ కోసం 33/11 కేవీ లైన్ కోరుకొండ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ మునగాల ఫీడర్‌లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ కోరుకొండ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. మండలంలోని మునగాల, కోటి, నల్లగొండ గ్రామాలకు ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని చెప్పారు.

లోక కల్యాణానికి ధ్యాన ఆధ్యాత్మిక సాధన


ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న రావు

రంగంపేట: ధ్యాన ఆధ్యాత్మిక సాధన లోక కల్యాణం కోసం ఉపయోగించాలని విశాఖపట్నంలోని పిరమిడ్ సొసైటీ రాష్ట్ర ప్రచారక్ కేవీ రావు అన్నారు. మంగళవారం స్థానిక దుర్గమాంబ పిరమిడ్ సొసైటీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహస్థ ధర్మాల్లో కుటుంబ బాధ్యతలు చిత్తశుద్ధితో ఆచరించి ధ్యానిగా జన్మను సార్థకత చేసుకోవాలన్నారు. భార్యాభర్తల అనుబంధాలు, ఆత్మీయతలు కృతజ్ఞతతో ఎలా పంచి, పెంచుకోవాలో సతీ అనసూయ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం దివంగత కొనుజుల నాగేంద్ర జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని సొసైటీ కేంద్ర సభ్యులు భ్రమరాంబిక, తులసి, సురేఖ, దుర్గ, సత్యవతి, స్వర్ణలక్ష్మి, కానవరం రాంబాబు, సూర్యారావు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనపై ర్యాలీ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

సీతానగరం: మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఏవీకే చైతన్య, డాక్టర్ ఈ.యేసురాణి, డాక్టర్ కె.సునీల్ ఆధ్వర్యంలో మంగళవారం మలేరియా నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యేసురాణి మాట్లాడుతూ, మలేరియా వ్యాధిని అశ్రద్ధ చేస్తే, క్రమంగా మెదడుకు సోకి ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందన్నారు. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. జనావాసాల్లో నీటి గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భూలోకమ్మ జాతర

కోరుకొండ: పశ్చిమ గానుగూడెంలో మంగళవారం భూలోకమ్మ తల్లి జాతర ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పలువురు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు మహిళలకు పట్టుచీరలు పంపిణీ చేశారు. అలాగే శ్రీరంగపట్నం–కోటి గ్రామాల మధ్య ఉన్న అయోధ్య నీలాలమ్మ జాతర ముగింపు సందర్భంగా మంగళవారం అన్న సమారాధన జరిగింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


చిత్రలేఖన పోటీని పర్యవేక్షిస్తున్న శ్రీలక్ష్మి

కంబాలచెరువు: ప్రస్తుత తరుణంలో పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా స్వీకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి అన్నారు. పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్.శ్రీలక్ష్మి పర్యవేక్షించారు. విజేతలకు ఈ నెల 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా జడ్జి బహుమతులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం, డ్రాయింగ్ టీచర్ పుప్పాల బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

తీర్థయాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

రాజమహేంద్రవరం సిటీ: అరుణాచల గిరి ప్రదర్శనకు ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో నుంచి ఈ నెల 10వ తేదీన ప్రత్యేక బస్సును నడపనున్నట్టు డిపో మేనేజర్ షేక్ షబ్నం మంగళవారం తెలిపారు. నాలుగు రోజుల యాత్రలో భాగంగా 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు బస్సు ఇక్కడి నుంచి బయలుదేరుతుందన్నారు. అరుణాచలం, కాణిపాకం, తిరుపతి క్షేత్రాల దర్శనం ఉంటుందన్నారు. 27న అరుణాచలం, రామేశ్వర యాత్రకు బస్సు పయనమవుతుందని చెప్పారు. ఈ యాత్రలో కాణిపాకం, శ్రీపురం, పళని, అరుణాచలం, కొయంబత్తూరు, ఊటీ, మైసూరు, గురువాయూర్, త్రివేండ్రం, రామేశ్వరం, కన్యాకుమారి, మధురై, శ్రీరంగం, తంజావూరు క్షేత్రాలను దర్శించేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. వివరాలకు 99666 66544, 95023 00189 నంబర్లలో సంప్రదించాలన్నారు.